క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కొడకండ్ల/తరిగొప్పుల/రఘునాథపల్లి/నర్మెట/ లింగాలఘణపురం : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంగ్లిష్‌తో పాటు ఎంఎల్‌టీ తాత్కాలిక పద్ధతిలో బోధించేందుకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయా మండల కేంద్రాల్లోని విద్యాలయాల ప్రత్యేక అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ బోధించేందుకు ఎంఎ ఇంగ్లిష్, బీఈడీ అర్హత కలిగి ఉండాలని, ఎంఎల్‌టీకి ఎండీ పాథాలాజీ, బయోకెమిస్ట్రీ, డీసీపీ, ఎంఎస్‌సీ మైక్రోబయోలజీ, ఎంఎల్‌టీ, బీఫార్మసీ ఎంఎస్‌సీ జెనిటిక్స్, ఎంబీబీఎస్, బీహెచ్‌ఎంఎస్, పీజీడీ క్లీనికల్ బయోకెమిస్ట్రీ అర్హత కలిగిన వారు సోమవారం పాఠశాలలో దరఖాస్తు చేయాలని కొడకండ్ల ఎస్‌ఓ మమత,తరిగొప్పుల ఎస్‌ఓ సునీత, నర్మెట ఎస్‌ఓ బైరోజు రజిత, రఘునాథపల్లి స్పెషల్ ఆఫీసర్ జి.హేమలత, లింగాలఘణపురం అన్నపూర్ణ సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.23 వేల గౌరవ వేతనం ఉంటుందని వారు పేర్కొన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలి

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థులు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భారతి దేవి ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. దరఖాస్తులను నేరుగా పాఠశాలలో అందించాలని మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



నర్మెట : మండలంలోని హన్మంతాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎక్స్‌రే, సిటీ స్కానింగ్, ఎమ్మారై పరీక్షలు అవసరమైన వారిని సోమవారం ఆస్పత్రికి తరలించనున్నట్లు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో పగడాల నర్సయ్య, రెడ్డబోయిన రాజు, గుడికందుల నరహరి, యాట క్రాంతి కుమార్, ఎల్లబోయిన నరేష్, కాల్వ అశోక్, హెండిగ హరికృష్ణ, డాక్టర్ల బృందం నితిన్, రీతూరాజ్, అన్సరుద్దీన్, శుభంగి, అమన్, సాయి సుప్రియ, సావిక్, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

జనగామ రూరల్ : సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని హోమియోపతి మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పరికిపండ్ల అశోక్ అన్నారు. శనివారం ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో సీజనల్ వ్యాధులు అవగాహన, వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి నిరోధక మందులను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ బి.సత్యం, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, సామాజిక వేత్తలు వేముల కొమ్మాల్ రెడ్డి, పైండ్ల శ్రీనివాసులు, భూక్య అబ్దుల్ నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



అంజవ్వ (ఫైల్)

లింగాలఘణపురం : మండలంలోని వనపర్తి మత్రితండాకు చెందిన గుగులోత్ అంజవ్వ (55)కు ఈ నెల 10న పాము కాటు వేసింది. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. అంజవ్వ 11వ తేదీ మధ్యాహ్నం అపస్మారక స్థితికి చేరుకోవడంతో జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా పాము కాటుకు గురైనట్లు గుర్తించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడి..

లింగాలఘణపురం మండలంలోని కుందారం గ్రామానికి చెందిన బత్తుల వెంకటమ్మ (58) గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతు మృతి చెందినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

అన్నదానం



జనగామ : మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య –అరుణాదేవి దంపతుల పెళ్లి రోజును పురస్కరించుకుని శనివారం రైల్వేస్టేషన్ ఆవరణలో మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఎండీ అన్వర్, సుల్తాన్, గోవింద్ రెడ్డి, రఘుఠాకూర్, శివకుమార్, శ్రీధర్, రమేష్, రాజు, శ్రీకాంత్, కౌశిక్ తదితరులు ఉన్నారు.

వేలాడుతున్న సర్వీస్ వైర్లు



ఇళ్ల మధ్య వేలాడుతున్న విద్యుత్ సర్వీసు వైర్లు



కర్రల సాయంతో ఏర్పాటు చేసిన సర్వీసు వైరు



ప్రమాదకరంగా ఉన్న సర్వీసు వైర్లు

- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు
- ఆందోళనలో కాలనీవాసులు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని శివునిపల్లిలో గల గుండయ్య మిల్లు సమీపంలో ఉన్న శ్రీకృష్ణ కాలనీలో ఇళ్లకు విద్యుత్ సరఫరా చేసే సర్వీసు వైర్లు వేలాడుతూ ప్రమాదరకంగా మారాయి. నేలపై నుంచి కేవలం నాలుగు ఫీట్ల ఎత్తులోనే సర్వీసు వైర్లు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు నిత్యం భయాందోళనలకు గురవుతున్నారు. పదేళ్ల క్రితం శివునిపల్లిలో శ్రీకృష్ణకాలనీ వెంచర్‌ను ఏర్పాటు చేయగా విద్యుత్ స్తంభాల సౌకర్యం లేక పోవడంతో కాలనీకి సమీపంలోని గుండయ్య మిల్లు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా చేసేందుకు సర్వీసు వైర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కాలనీలో పదిహేను ఇళ్లు ఉండగా ఆరునెలల క్రితం కాలనీలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి లైన్లను వేశారు. అయినప్పటికీ విద్యుత్ శాఖ సిబ్బంది కాలనీలోని పలు ఇళ్లకు నూతన లైన్ నుంచి విద్యుత్ సరఫరా అందించడం లేదు. దీంతో దాదాపు 40 మీటర్ల దూరంలో ఉన్న పాత ట్రాన్స్‌ఫార్మర్ నుంచే సర్వీసు వైర్లతో కరెంట్ సరఫరా జరుగుతోంది. సదరు సర్వీసు వైర్లకు కర్రలే ఊతం కావడంతో ఈదురుగాలులకు వైర్లు వేలాడుతున్నాయి. విద్యుత్ స్తంభాల నుంచి కరెంట్ సరఫరా చేయాలని కాలనీవాసులు ఎంతగా కోరినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసిన అధికారులు నూతన లైన్ నుంచి విద్యుత్ సరఫరా చేయడం లేదని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై సంబంధిత ఏఈకి, లైన్‌మన్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైర్లను సరిచేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో కాలనీవాసుల ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తామని కాలనీ వాసులు హెచ్చరిస్తున్నారు.

నాన్న స్ఫూర్తే నడిపించింది

నాన్న స్ఫూర్తే నడిపించిందని, తమ తండ్రి పడిన శ్రమకు తగిన ఫలితం దక్కిందని అంటున్నారు పుత్రులు. నాన్న కష్టానికి ప్రతిఫలంగా ఎదిగిన కుమారుల మనోగతంపై.. నేడు ఫాదర్స్‌డే సందర్భంగా..



తండ్రి భిక్షపతితో కుటుంబ సభ్యులు

సాఫ్ట్‌వేర్‌లో రాణిస్తున్న కుమారులు

దేవరుప్పుల: తండ్రి ఆటోవాలా శ్రమకు తగిన ఫలితంగా తనయులుగా హైటెక్ సిటీలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహణకు ఎదిగారు. మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన రచ్చ భిక్షపతి–పుష్పలీల చేనేత మగ్గంపై ఆధారపడి ముగ్గురు కుమారులను చదివించారు. కొడుకుల అభ్యున్నతికి తండ్రి ఆటోరిక్షాతో పట్నం బయలుదేరి వారి ఉన్నత విద్య పూర్తిచేసేలా శ్రమించారు. తల్లిదండ్రుల కలలు సాకారం చేసేందుకు పెద్దకుమారుడు వెంకటేశ్వర్లు టెలికామ్ విభాగంలో ఐటీ సంస్థను నెలకొల్పి తమ్ముడు సతీష్, ఉమేష్‌లను భాగస్వాములను చేశాడు. అలాగే పలువురికి ఉద్యోగాలు ఇస్తూ పేదరికాన్ని జయించి ఓ స్థాయికి చేరారు. అయితే తండ్రి తీవ్ర అనారోగ్యానికి గురికాగా వైద్యుల సూచనల మేరకు స్వగ్రామంలో ఓ భవంతి నిర్మించి తమ తండ్రిని కాపాడుకుంటున్నారు. దీంతో స్వగ్రామంలోనే ఆటోవాలా.. హైటెక్ సిటీని తలపించేలా ఇల్లు నిర్మించారని పొగడడం నాన్న పట్ల కొడుకుల ప్రేమకు అద్దం పడుతోంది.

నాన్న పట్టుదలతోనే ఉద్యోగాలు సాధించా: కేదారేశ్వర రెడ్డి



తల్లిదండ్రులతో కేదారేశ్వర్

జనగామ రూరల్ : మా నాన్న వ్యవసాయం చేస్తు కష్టపడి చదివించాడు. కష్టం విలువ తెలియనికుండా నాకు సపోర్ట్ చేయడంతోనే చెన్నై, ఢిల్లీ యూనివర్సిటీలో మాస్టర్స్ ఇన్ సోషల్ వర్క్ పూర్తి చేశాను. నాన్న కష్టానికి ప్రతిఫలంగా మూడు ఉద్యోగాలు సాధించాను. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి కారణం నాన్న సుంకరీ శ్రీనివాస్‌రెడ్డి.

‘డబుల్’ ఇళ్లకు మరమ్మతు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

రఘునాథపల్లి : మండలంలోని కంచనపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు మరమ్మతు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద పసుల దానియేలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువులు, గడ్డివాములు ఏర్పాటు చేయడంతో ఇళ్లు శిథిలమయ్యాయన్నారు. అధికారులు స్పందించి తలుపులకు మరమ్మతులతో పాటు విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించి పేదలకు అండగా ఉండాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు సుగుణమ్మ, ఆది సాయన్న, యాదగిరి, కందుకూరి మల్లేశం, దావీదు, దయాకర్, సుధాకర్, శ్రీ లత, శిరీష, కోమలత, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

బారికేడ్ల బహూకరణ



సీఐకి బారికేడ్లను అప్పగిస్తున్న హెచ్‌ఎం మరియాజోసెఫ్

జనగామ : జనగామ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణతో పాటు వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు నెహ్రూపార్కు రోడ్డు సెయింట్ పాల్స్ స్కూల్ యాజమాన్యం పోలీసులకు శనివారం బారికేడ్లను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు, ఫాదర్ మరియాజోసెఫ్ ఆధ్వర్యంలో సీఐ దామోదర్‌రెడ్డికి వాటిని అప్పగించారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు స్కూల్ యాజమాన్యం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. అంతకు ముందు ట్రాఫిక్ నిబంధనలు, చట్టంపై సీఐ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరుప్పుల మండల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



కోలుకొండలో మగ్గం నేస్తున్న యశస్వినిరెడ్డి

దేవరుప్పుల : మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మున్‌పహాడ్, ధర్మాపురం, కోలుకొండ, అప్పిరెడ్డిపల్లె, సింగరాజుపల్లి, పెద్దమడూరు, నీర్మాల, చౌడూరు, రంభోజీగూడెం, కడవెండి తదితర గ్రామాల్లో సుడిగాలి పర్యటనతో రూ.1.60 కోట్లతో సీసీరోడ్లు, పారిశుద్ధ్య పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా పైరవీలకు తావివ్వకుండా ఇంటింటా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కోలుకొండలో చేనేత సొసైటీని సందర్శించి మగ్గం నేసీ కార్మికుల అభ్యున్నతి కోసం పాటుపడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ, తార, నాయకులు సురేష్‌బాబు, ధర్మారెడ్డి, పాండు కృష్ణ, మాలతి, గణేష్, నాగరాజు, సజ్జన్, రసూల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పరామర్శ

కొడకండ్ల : రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్‌ను శనివారం ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో రాజేష్‌నాయక్, నాయకులు రోజ, వెంకట్రాం, రవి, శ్రీకాంత్, నరేందర్, శోభ, వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రమేశ్ మృతి పార్టీకి తీరని లోటు: ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల : కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మొలుగూరి రమేశ్ మృతిపార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కామారెడ్డిగూడెంలో రమేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా రమేశ్ అనారోగ్యానికి గురయితే రాలేదని ఇప్పుడు పలకరించేందుకు వచ్చారా అంటూ అతడి బంధువులు ఎమోషనల్‌గా వాగ్వివాదానికి దిగడం చర్చంశనీయంగా మారింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, విజయ డెయిరీ జిల్లా చైర్మన్ కాసారపు ధర్మారెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు ఉప్పుల సురేష్ బాబు, మాజీ ఎంపీటీసీలు ఒడపల్లి రవీందర్, జాకీర్, పాండు కృష్ణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు, భూక్య సజ్జన్, నాగరాజు, మహ్మద్ గులాం రసూల్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఉమేష్, గ్రామశాఖ అధ్యక్షుడు ఒడపల్లి పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు నివాళి

బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడిగా సేవలందించిన మొలుగూరి రమేశ్ చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయాకర్, రవి, నాయకులు బస్వ మల్లేషం, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, సాయిలు, సత్తయ్య, నర్సింహ్ములు, లాలు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్ చార్జీలు ఉపసంహరించుకోవాలి



ఆర్టీసీ కంట్రోలర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ : విద్యార్థుల బస్‌పాస్ చార్జీల పెంపు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు యాకన్న రాథోడ్ కోరారు. ఈమేరకు విద్యార్థి సంఘాల జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్‌లో కంట్రోలర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను పెంచడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులు బస్‌పాస్‌లతో పట్టణాలకు వెళ్లి చదువుతున్నారని, చార్జీల పెంపుతో వారు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తూ విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు పెంచడం సమంజసం కాదన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు లకావత్ చిరంజీవి, మహమ్మద్ యూనస్, కె.శరత్‌కుమార్, మునిగాల పవన్, నునావత్ జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

వరుణుడు కరుణించాలని..



జఫర్‌గఢ్ : విత్తనాలు మొలకెత్తాలని.. పంటలు బాగా పండాలని.. చిన్నారులు వానదేవుడిని వేడుకుంటూ కప్పతల్లి ఆట ఆడారు. సకాలంలో వరుణుడు కరుణించి వర్షాలు బాగా కురియాలని జఫర్‌గఢ్ గ్రామ శివారు వడ్డే గూడెంలో చిన్నారులు శనివారం కప్పతల్లి ఆట ఆడారు. ఈ సందర్భంగా పిల్లలు రోకలికి కప్పను కట్టి భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ ఆడారు. ఈ సందర్భంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని పంటలు పండాలంటూ పిల్లలను దీవించారు.

రక్తదాన శిబిరం



రఘునాథపల్లి: రక్తదాన శిబిరంలో పాల్గొన్న మేనేజర్ వెంకట్, వైద్యులు

రఘునాథపల్లి : ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోమళ్ల టోల్ ప్లాజా మేనేజర్ వెంకట్ కోరారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా టోల్‌ప్లాజాలో ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు యువకులు పాల్గొని రక్తదానం చేశారు. జనగామ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు కరుణాకర్, దివ్య శిబిరంలో 25 యూనిట్ల రక్తం సేకరించారు. రక్తదానం చేసిన యువకులను వెంకట్‌తో పాటు వైద్యులు అభినందించారు. హెచ్‌ఎల్ఎల్ నటరాజ్, టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..



జనగామ రూరల్: జిల్లా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న యువకులు

జనగామ రూరల్ : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా ఆస్పత్రిలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కాగా జావీద్, ఆసీఫ్, ములకలపల్లి వికాస్, అషరఫ్, మిదపాక రాజు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు. ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజ్ , ప్రతినిధులు నల్ల వినోద్, జుబేర్, బండ్ల నవీన్, హాస్పటల్ సిబ్బంది రాజేష్, శ్రీరాములు, ప్రవీణ్ ,తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలు నిలిపివేయాలి



బచ్చన్నపేట : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో చెరువు శిఖం, కుంటల భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు నిలిపివేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చెరువుల మట్టిని ఇటుకల తయారీకి తరలిస్తున్నారని, బట్టీలను అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ మట్టి రవాణాను నిలిపివేస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రవీందర్‌రెడ్డి, ఎల్లయ్య, అశోక్, నర్సింహులు, సుధాకర్, మనోహర్, రవి పలువురు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు



జనగామ : స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని కోరుతూ పట్టణంలోని 11వ వార్డు వీవర్స్ కాలనీలో బాల

సంక్షిప్త సమాచారం

భక్త అంజనేయ స్వామి సహిత భక్తమార్కండేశ్వర దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు ఝెనగందుల కృష్ణ ఆధ్వర్యంలో గుర్రం నాగరాజు, అంకం తిరుమలేశు, కొండ మల్లికార్జున్, కొందారపు గణేష్, కోణం రామలింగేశ్వర్, నల్ల హనుమంతు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎమ్మెల్యే కోలుకోవాలని పూజలు

బచ్చన్నపేట : చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని మండలంలోని వీఎస్ఆర్ నగర్ మాజీ సర్పంచ్ కోనేటి స్వామి శనివారం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుంజయ్ కుమార్, నరేష్, హరియోగిరాం, శ్రీకాంత్, రజినీకాంత్, నర్సింహులు పాల్గొన్నారు.

చిల్పూరు : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజ్వేర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని వీరాభిమాని బొడ్డుల గణేష్ శనివారం చిల్పూరు ఆలయ 125మెట్లను ఎక్కాడు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ



చిల్పూరు : చిల్పూరుగుట్ట అంగడి ఆవరణలో భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శనివారం అర్చకులు రవీందర్ శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు భూమిపూజ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన దాతలు తిరుమణి కిషన్‌పటేల్–ప్రవంతి, మనోజ్–మహేష్‌తో పాటు మల్కాపూర్ గ్రామానికి చెందిన చిల్పూరు ఆలయ ధర్మకర్త నారాయణరెడ్డి ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంపత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు భగవద్గీతను ఆచరించాలి

జనగామ రూరల్ : భగవద్గీతను ప్రతీ ఒక్కరు చదివి ఆచరించాలని హిందూ జ్ఞాన వేదిక–ప్రబోధ సేవా సమితి జిల్లాకమిటీ సభ్యుడు దేవేంద్ర అన్నారు. శనివారం మండలంలోని వడ్లకొండ గ్రామంలో హిందూ జ్ఞాన వేదిక–ప్రభోద సేవా సమితి భువనగిరి,జనగామ,చేర్యాల,తొర్రూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత ఆదికర్త ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన శతాధిక గ్రంథములను ఇంటింటికి పరిచయం చేస్తూ ప్రచారం చేశారు. పంచాక్షరి, శ్రీనాథ్, రాము, లింగస్వామి భాస్కర్, ఉపేందర్, శ్రీరామ్, శ్రీవాత్సవ్, సాయిరాజు, అశోక్,రాణి, ధనలక్ష్మి,కవిత, నర్సమ్మ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

కారోబార్ కుటుంబానికి పరామర్శ

బచ్చన్నపేట : మండలంలోని పోచన్నపేట పంచాయతీ కారోబార్ శ్రీనివాస్ తండ్రి మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను శనివారం గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పరామర్శించారు. అసోసియేషన్ సలహాదారుడు మురళి, కో కన్వీనర్ తాళ్ల ప్రభాకర్, కొరిమి రామయ్య సంతాపం ప్రకటించారు. పోచన్నపేట గ్రామ పంచాయతీ సిబ్బంది యేసోబు పలువురు పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి



కళ్యాణ్

చిల్పూరు : సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్ రావు అక్రమ అరెస్టు కూటమికి కోర్టు బుద్ధి చెప్పిందని వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మునిగాల కళ్యాణ్ రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. కొమ్మినేని అక్రమ అరెస్టు సుప్రీంకోర్టు తీర్పుతో ప్రజాసామ్యాన్ని పునాదులు నిలబెట్టిందని అన్నారు. సాక్షి కార్యాలయంపై దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

‘ఆరోపణలు చేస్తే సహించేది లేదు’



మాట్లాడుతున్న యాదగిరి

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని కొత్తపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవినీతి జరిగిందంటూ కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ చెవుల యాదగిరి అన్నారు. కొత్తపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా కొత్తపల్లి గ్రామంలో అధికారులు పారదర్శకంగా సర్వే చేపట్టి లబ్ధిదారుల ఎంపిక చేశారన్నారు. అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక కొందరు సోషల్ మీడియా వేదికగా ఇందిరమ్మ ఇళ్లలో అవినీతి జరిగిందని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. గ్రామంలో ఇళ్లు రాని పేదలను రెచ్చగొడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై, స్థానిక కాంగ్రెస్ నాయకులపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉండి పేదలను పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు ప్రస్తుతం విమర్శలు చేయడం సిగ్గుచేటని, కొత్తపల్లిలో డబుల్‌బెడ్రూం ఇళ్లను పేదలకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో పదేపదే ఎమ్మెల్యే కడియంపై, కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేస్తున్న వారు తమ వైఖరిని మార్చుకోవాలని, లేనిపక్షంలో తప్పుడు ప్రచారాలు చేసేవారిపై, ప్రోత్సహిస్తున్న వారిపై చట్టపరంగా కేసులు పెడతామని హెచ్చరించారు. ఆరోపణలు చేసేవారు నిరూపించాలని, లేదంటే బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు బెల్లపు వెంకటస్వామి, పార్వతిగట్టయ్య, మాజీ సర్పంచ్ నరేందర్, నాయకులు ముక్కెర రవి, షౌకత్‌అలీ, రవి, రాజిరెడ్డి, రాజయ్య, మల్లేశం ,నాని, రమేష్, వి.మహేష్ పాల్గొన్నారు.

‘స్థానికం’లో గెలుపే లక్ష్యంగా..



కొడకండ్ల : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఎంపీటీసీ క్లస్టర్ పరిశీలకుడు దేశగాని నాగరాజు కోరారు. శనివారం లక్ష్మక్కపల్లి గ్రామంలో జంపాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన క్లస్టర్ స్థాయి సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, అన్ని వర్గాల ప్రజలతో మమేకమై పార్టీ అభ్యర్థులకు ఓటు వేసేలా ప్రణాళికతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో మార్కెట్, సొసైటీ డైరెక్టర్లు నామాల ఈదయ్య, ఉప్పలయ్యగౌడ్, పర్శరాములు, రవీందర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.